మొదలైన సంక్రాంతి సందడి


పోటీలో ముగ్గులను వేస్తున్న మహిళా మణులు


సంక్రాంతి ముగ్గు

కడప కల్చరల్‌ : తెలుగువారు పెద్ద పండుగగా భావించే సంక్రాంతి కళ క్రమంగా పుంజుకుంటోంది. పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ముగ్గులు కనువిందు చేస్తున్నాయి. ఇళ్ల ముందు కూడా రంగురంగుల ముగ్గులు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ముగ్గులన్నా, ముగ్గులు వేయడమన్నా ఇష్టపడని మహిళలు ఉండరు. తీరిక వేళల్లో ముగ్గులు వేస్తూ సీజన్‌ను బట్టి ఇళ్ల ముంగిట రంగవల్లులను తీర్చిదిద్దుతుంటారు. తమ సృజన నైపుణ్యాలను ప్రదర్శిస్తూ రంగురంగుల ముగ్గులను తళుకుమనిపిస్తుంటారు.

పుస్తకాల సాయం..

సాధారణంగా మహిళలు ఎప్పటికప్పుడు తమ ముగ్గుల్లో కొత్తదనం చూపేందుకు, సృజనను ప్రదర్శించేందుకు ఉత్సాహం చూపుతుంటారు. పత్రికల నుంచి సేకరించుకున్న ముగ్గుల్లో కొద్దిమార్పులు చేసి తమదైన శైలిలో రంగులు అలంకరిస్తుంటారు. ప్రస్తుతం వారికి ఆ సమస్య లేకుండా ప్రత్యేకంగా ముగ్గుల పుస్తకాలు మార్కెట్లలో అందుబాటులోకి వచ్చాయి. ఇలాంటి వారి కోసం పబ్లిషర్లు మార్కెట్లలో కళ్లు చెదిరే రంగుల్లో ముగ్గుల పుస్తకాలను రూపొందించి విక్రయాలకు సిద్ధం చేశారు. ప్రస్తుతం ముగ్గుల పుస్తకాలకు జిల్లా అంతటా మంచి డిమాండ్‌ ఉంది.

■ సాధారణంగా ధనుర్మాసం నుంచి ఇళ్ల ముందు ముగ్గులు కళకళలాడుతాయి. సంక్రాంతి వరకు ఇళ్లలోగిళ్లలో ముగ్గుల కళ కనిపిస్తుంది. ముగ్గులు లేని సంక్రాంతిని ఊహించలేం. జిల్లాలో పలుచోట్ల మహిళల కోసం ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కడప నగరంలో కూడా ఇప్పటికే పెద్దమొత్తాలను బహుమతులుగా పలుచోట్ల పోటీలు నిర్వహించారు. మరికొన్ని సంస్థలు కూడా ఈ పోటీలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి. జిల్లాకు చెందిన పలువురు మహిళలు ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో తమ ముగ్గుల ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించారు. సంక్రాంతి సంతోషాలను ఈ బహుమతులతో రెట్టింపు చేసుకుంటున్నారు.

రంగురంగుల పుస్తకాలు

నిజానికి ముగ్గులు వేయడం ఒక అందమైన కళ. ముగ్గు చక్కగా కుదరితే దాన్ని అందరూ ప్రశంసిస్తుంటే అతివలు మురిసిపోతుంటారు. రంగురంగుల ముత్యాల ముగ్గులు వేయాలన్న తపన ఉన్నా వేయలేని వారి కోసం మార్కెట్‌లో దాదాపు 30 రకాల ముగ్గుల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 నుంచి 40 పేజీలతో ఒక పేజీకి ఒకటి నుంచి నాలుగు రంగుల ముగ్గులను ప్రచురిస్తున్నారు. ఇందులో చుక్కల ముగ్గులు, డిజైన్‌ ముగ్గులు, కాన్సెప్ట్‌ ముగ్గులు కూడా ఉన్నాయి. ఒకటి, రెండుసార్లు సాధన చేసి నేరుగా 'ముగ్గు'లోకి దిగేయడమే ఆలస్యం. సంక్రాంతికి పది రోజుల ముందునుంచి ఈ పుస్తకాలకు మంచి డిమాండ్‌ ఉంటోంది. కడప నగరంలోని పలు బుక్‌స్టాల్స్‌లో రంగురంగుల ముగ్గుల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

• బంగారు కొండలు

అనంతపురం : జవహర్‌లాల్‌ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం–జేఎన్‌టీయూ(ఏ) 13వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. యూనివర్సిటీ ఆడిటోరియంలో కట్టుదిట్టమైన భద్రతా పర్యవేక్షణలో జరిగిన వేడుకలో యూనివర్సిటీ చాన్సలర్‌/ రాష్ట్ర గవర్నర్‌ జస్టిస్‌ ఎస్‌. అబ్దుల్‌ నజీర్‌ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందించారు. పలువురు జిల్లాకు చెందిన విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు.

జేఎన్‌టీయూ (ఏ) వీసీ రంగ జనార్దన చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్న వారు


ఎం. సాయి ఉపేంద్ర రెడ్డి (కడప)


బిజివేముల చంద్ర ప్రకాష్‌ రెడ్డి, (పులివెందుల)


సోమల జగదీశ్వర రెడ్డి (పులివెందుల)


సి పెంచల లక్ష్మీ సుష్మ (పులివెందుల)


పాలగాటి రాజమోహన్‌ రెడ్డి (పులివెందుల)


చింతా గోవర్ధన్‌ (పులివెందుల)


పోతిరెడ్డి విష్ణుప్రియ (పులివెందుల)


పి. సంగీత (పులివెందుల)


రాయలం జయశ్రీ (పులివెందుల)

ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ


ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి

పులివెందుల : పులివెందులలో శనివారం కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి పునఃనిర్మాణానికి ఇటీవలే ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా కోటి రూపాయల నిధులు మంజూరు చేసింది. అందుకు సంబంధించి ఆయన మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఆలయ పునఃనిర్మాణానికి అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య భూమి పూజ చేశారు. అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడారు. క్యాలెండర్లు ప్రభుత్వ పథకాలు ప్రతిబించేలా రూపొందించినందుకు రాచమల్లు రవిశంకర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం ఆయన పార్నపల్లె రోడ్డులోని లింగాల మండల నాయకులు జలంధర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్‌ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, మార్కెట్‌ యార్డు చైర్మన్‌ చిన్నప్ప, సివిల్‌ సప్లయ్‌ రాష్ట్ర డైరెక్టర్‌ హాలు గంగాధరరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎంపీ దంపతులు

పులివెందుల : తన సమీప బంధువులైన ఇసీ గంగిరెడ్డి మేనకోడలు తులశమ్మ, ఎద్దుల విష్ణుకుమార్‌రెడ్డిల కుమారుడు డాక్టర్‌ జగదీశ్వరరెడ్డి, డాక్టర్‌ లక్ష్మీప్రియల వివాహ వేడుకలకు ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, సతీమణి సమతమ్మలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు పలువురు వైఎస్‌ కుటుంబీకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి దంపతులు

పులివెందుల అరటికి విదేశాల్లో భలే గిరాకీ

- నియోజకర్గంలో అధిక విస్తీర్ణంలో అరటి పంట
- రూ.16 కోట్లతో కోల్డ్‌ స్టోరేజ్‌ ఏర్పాటు


అరటి గెలలను ఎగుమతి చేస్తున్న కూలీలు

పులివెందుల రూరల్‌ : నియోజకవర్గంలో పండిస్తున్న అరటికి చాలా ప్రత్యేకతే కాక విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దేశంలోనే అరటిని ఎక్కువగా పండించే ప్రాంతంలో పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె గ్రామాలతోపాటు లింగాల, తొండూరు, వేముల మండలాల్లో రైతులు అరటి పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రవాణాలో ఆలస్యం జరిగినా అరటి కాయలు దెబ్బతినే అవకాశం ఉండకుండా కాయలను భద్రపరుస్తారు. మహారాష్ట్ర వ్యాపారులు పులివెందులలో డిసెంబర్‌ నుంచి ఫిబ్రవరి వరకు ఈ ప్రాంతాల్లోనే మకాం వేసి కొనుగోలు చేసిన అరటి కాయలను గల్ఫ్‌ దేశాలకు ఎగుమతి చేస్తారు. వ్యాపారులు కొనుగోలు చేసిన పంటను వాహనాల ద్వారా ముంబైకి తరలించి అక్కడి నుంచి ఓడల ద్వారా గల్ఫ్‌ దేశాలకు తరలిస్తారు. మరికొందరు వ్యాపారులు శ్రీనగర్‌, పంజాబ్‌ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30వేల హెక్టార్లల్లో అరటి సాగు చేస్తున్నారు. పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో రూ.16 కోట్లతో 2 వేల టన్నుల అరటి కాయలు నిల్వ ఉంచే విధంగా అరటి కోల్డ్‌ స్టోరేజ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కోల్డ్‌ స్టోరేజ్‌ను రెండు నెలల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. రైతులు పండించిన తమ పంటలను కోల్డ్‌ స్టోరేజ్‌లో నిల్వ ఉంచుకుని రేట్లు అధికంగా వచ్చినప్పుడు అమ్ముకునే విధంగా ఇక్కడ కోల్డ్‌ స్టోరేజ్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై ఈ ప్రాంత రైతులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌ అరటి ధరలు టన్ను రూ.15వేల నుంచి రూ.18వేల వరకు ఉన్నట్లు రైతులు అంటున్నారు.

విదేశాలకు ఎగుమతి కావడం ఆనందంగా ఉంది



పులివెందుల ప్రాంతంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో పండించే అరటి విదేశాలకు ఎగుమతి చేయడం చాలా ఆనందంగా ఉంది. నల్లపురెడ్డిపల్లె గ్రామంలో పండించే అరటికి ఒక ప్రత్యేకత కూడా ఉంది. అందువల్ల ప్రతి రైతు తనకున్న పొలంలో అరటిని సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూడా అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

– ఉమ్మారెడ్డి(అరటి రైతు), నల్లపురెడ్డిపల్లె, పులివెందుల

ఇతర రాష్ట్రాలలో కూడా భలే గిరాకీ



పులివెందుల నియోజకవర్గంలో పండించే అరటికి ఇరత రాష్ట్రాలలో కూడా మంచి గిరాకీ ఉంది. ఇక్కడ వ్యాపారులు కూడా ఈ ప్రాంతంలో పండించే అరటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అరటి ధరలు కూడా బాగానే ఉన్నాయి. నల్లపురెడ్డిపల్లె, ఎర్రబల్లె, కొత్తపల్లె గ్రామాల్లో పండించే అరటిని గల్ఫ్‌ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

– రామమల్లేశ్వరరెడ్డి(అరటి రైతు), నల్లపురెడ్డిపల్లె, పులివెందుల

క్లుప్తంగా

పుస్తకం ఆవిష్కరణ

వైవీయూ : వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డా. ఎన్‌. ఈశ్వరరెడ్డి రచించిన 'సమాజంలో సాహిత్యం' పుస్తకాన్ని శనివారం రాజమహేంద్రవరంలోని బొమ్మూరులోని సాహిత్యపీఠంలో ఆవిష్కరించారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్‌ చాన్సలర్‌ ఆచార్య కడప రమణయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం పుస్తకాన్ని డా. ఎన్‌. ఈశ్వరరెడ్డి కడప రమణయ్య దంపతులకు అంకితం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కథా రచయితలు డా. ఎన్‌. మల్లీశ్వరి, డా. గూటం స్వామి, ఆచార్యులు శ్రావణ్‌కుమార్‌, ఎం.హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగర పరిధిలోని రోడ్లపై ఉన్న అనాధలకు ప్రాజెక్టు ఆలంబన పేరుతో చేయూత అందించడం సంతోషదాయకంగా ఉందని జేబీవీఎస్‌ ది ప్రిజర్వర్‌ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్‌ తెలిపారు. తన సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆయన శనివారం తన మిత్ర బృందంతో కలిసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అశోక్‌ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

వైవీయూ : జాతీయ సేవాపథకం వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైవీయూ ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌–4 ప్రోగ్రాం అధికారి డా. ఎస్‌.పి. వెంకటరమణ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు పరిసరాలను శుభ్రం చేశారు.

కలెక్టరేట్‌ ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్‌ : రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి పరిషత్తు (ఏబీవీపీ) నాయకులు అన్నారు. ఈ విషయమై శనివారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో యువత మెగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు పెంచలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్యంరాజు, వెంకటేష్‌, హరి, శంకర్‌, యువకులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన


ఓటు నమోదుపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్‌ : కడప ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు నిర్వహిస్తున్న స్పెషల్‌ క్యాంపులో భాగంగా శనివారం కడప రవీంద్రనగర్‌లో ఓటు నమోదుపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఓటు నమోదుకు సంబంధించిన నినాదాలను చేస్తూ వీధుల వెంబడి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు నమోదుపై స్థానికులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ ముంతాజ్‌బేగం, పాఠశాల హెచ్‌ఎం నరేంద బాబు, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్‌, బిఎల్‌ఓ ప్రసాద్‌, కళాశాల పీడీ అరుణకుమారి, ఎన్‌ఎస్‌ఎస్‌ పోగ్రాం ఆఫీసర్లు గోవిందరెడ్డి, షకీలబేగం తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కాంగ్రెస్‌ పార్టీలో పలువురికి నియామకాలు చేపట్టినట్లు కాంగ్రెస్‌ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఆయన 42వ డివిజన్‌ ఇన్‌చార్జిగా ఎస్‌. మహమ్మద్‌ సాదిక్‌ కు నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కోటపాటి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, మొహమ్మద్‌ సికిందర్‌

కడప ఎడ్యుకేషన్‌ : స్వాతంత్య్ర సమరయోధులను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని మను పాలిటెక్నిక్‌ కళాశాల అధ్యాపకుడు మొహమ్మద్‌ సికిందర్‌ పేర్కొన్నారు. ఆయన రూపొందించిన స్వాతంత్య్ర సమరయోధులకు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను శనివారం కడప సాలే నాగయ్యవీధిలోని మున్సిపల్‌ కార్పొరేషన్‌ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్‌ జుబైర్‌ అహ్మద్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్‌ అడ్మిషన్స్‌ కో ఆర్డినేటర్‌ హరిప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్‌ పాస్‌ లేదా ఇంటర్‌, డిప్లొమా, డిగ్రీ పాస్‌/ఫెయిల్‌ అయిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. 18–26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. 35 రోజులపాటు కడప నగరంలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రైవేట్‌ బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : జిల్లాలో అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్‌ బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్‌ పేర్కొన్నారు. శనివారం నగరంలోని మరియాపురం సెయింట్‌ జోసెఫ్‌ జూనియర్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్‌ బీఈడీ కళాశాల యాజమాన్యాలు కౌన్సిలింగ్‌ పూర్తిగాక ముందే ఇష్టానుసారంగా మేనేజ్‌మెంట్‌ సీట్లు భర్తీ చేస్తున్నారని తెలిపారు. మేనేజ్‌ మెంట్‌ సీట్లలో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను చేర్చుకోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అంకన్న, రాజేంద్రప్రసాద్‌, రాహుల్‌, సునీల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ల ఎంపికలు


యూత్‌ వలంటీర్ల ఎంపికలు నిర్వహిస్తున్న ఆర్‌డీఓ మధుసూదన్‌, తదితరులు

కడప స్పోర్ట్స్‌ : భారత ప్రభుత్వం, నెహ్రూ యువకేంద్రం, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్‌ వలంటీర్ల ఎంపికలకు నిరుద్యోగ యువత నుంచి చక్కటి స్పందన లభించింది. కడప నగరంలోని యూత్‌హాస్టల్‌లో నిర్వహించిన ఈ ఎంపికల ప్రక్రియను కడప ఆర్‌డీఓ మధుసూదన్‌, నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెహ్రూ యువకేంద్రం వలంటీర్లుగా ఎంపికయ్యే వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సేవాభావం కలిగిన యువతను వలంటీర్లుగా ఎంపికచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెలక్షన్‌ కమిటీ సభ్యులు సతీష్‌, చంద్ర, బాలుడు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


మున్సిపల్‌ ఉర్దూ హైస్కూల్లో మొక్కలను నాటుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాల ముందస్తు వేడుకల్లో భాగంగా శనివారం కడప మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఉర్దూ హైస్కూల్‌లో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్టీయూ సంఘం ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పలత, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎండి ఇలియాస్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి నరైడ్డి సంగమేశ్వరరెడ్డి, నాయకులు రవిశంకర్‌రెడ్డి, చింతం రామచంద్రారెడ్డి, చల్లా విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భాగవత సప్తాహం

కడప కల్చరల్‌ : కడప నగరం మున్సిపల్‌ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో గల బిట్టా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం కార్యాలయంలో ఆదివారం నుంచి వారం రోజులపాటు భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు కాకనూరు సుబ్బారెడ్డి తెలిపారు. పుట్టపర్తికి చెందిన ప్రవచన కర్త వి.అన్నాజీరావుచే ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

చదువుల బాబుకు సత్కారం


చదువుల బాబును సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : రాజమహేంద్రవరం గ్రేట్‌ కళాశాల ప్రాంగణంలో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు ఆంధ్ర సారస్వత పరిషత్‌ ఆధ్వర్యంలో శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల సందర్భంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మహాసభల్లో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు శనివారం నేటి పిల్లలు, తల్లిదండ్రుల సమస్యలు, పిల్లలను తీర్చిదిద్దడంలో సాహిత్యం పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం చదువుల బాబును కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీతలు చొక్కపు వెంకటరమణ, పత్తిపాక మోహన్‌ సత్కరించారు.

మూల్యాంకన విధుల పారితోషికం చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లాలో గత సంవత్సరం ఏప్రిల్‌ మాసంలో జరిగిన పదవ తరగతి మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికాన్ని ఉపాధ్యాయులకు తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్‌, పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది పారితోషకం ఇవ్వకపోతే 2024లో జరిగే మూల్యాంకన విధులను బహిష్కరిస్తామని తెలిపారు.

ఫొటోగ్రఫీ నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఫొటోగ్రఫీ రీసోర్స్‌పర్సన్‌ హరి వనం

వైవీయూ : ఫొటోగ్రఫీ సర్టిఫికెట్‌ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థినులు ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు, నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ఫొటోగ్రఫీ రీసోర్స్‌పర్సన్‌ హరి వనం పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్‌ కోర్సుకు సంబంధించిన ఆయన ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీకి సంబంధించిన థియరీ, ప్రాక్టికల్‌ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డా. వి. సలీంబాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫైనాన్స్‌ ఉద్యోగిని నిర్వాకంపై పోలీసుల సమగ్ర విచారణ

కడప అర్బన్‌ : కడప నగరంలోని చిన్నచౌక్‌ పిఎస్‌ పరిధిలోని ఓ ఫైనాన్స్‌ సంస్థలో క్యాషియర్‌గా సౌజన్య అనే మహిళ పనిచేస్తూ కస్టమర్లకు డబ్బు ఆశ చూపించింది. బంగారు ఆభరణాలను తమ సంస్థలోనే తాకట్టు పెట్టించింది. బాధితులంతా తాము మోసపోయామని తెలుసుకునేలోపు సౌజన్య పరారైంది. ఈ సంఘటనపై బాధితులు ఎస్పీని, కడప డీఎస్పీని కలిసి విన్నవించుకున్నారు. పోలీసులు ఈ విషయంపై లోతుగా విచారిస్తున్నారు. ఇంకా ఎవరైనా బాధితులు వుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇప్పటికి 30 మంది బాధితులు ఫిర్యాదు చేశారు.

విలువలను తెలిపే విద్య అవసరం

కడప కల్చరల్‌ : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచమంతా భారతీయ విలువలను తెలిపే విద్య అవసరమని కడప కేంద్ర కారాగార సూపరింటెండెంట్‌ ఇందుపల్లి నిత్య హితప్రకాశ్‌ అన్నారు. శనివారం స్థానిక ఇంటర్నేషనల్‌ ఢిల్లీ పబ్లిక్‌ స్కూలు వార్షికోత్సవ వేడుకలను డైరెక్టర్‌ ఎం.వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని, తల్లిదండ్రులు సహకరిస్తే విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చగలరన్నారు. సభాధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి , ప్రత్యేక అతిథి సుధీర్‌కుమార్‌రెడ్డి, న్యాయవాది సుధాకర్‌బాబ్జి మాట్లాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఉర్రూతలూగించాయి.

ప్రారంభమైన కూచిపూడి నృత్యం వర్క్‌షాప్‌


వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక వైఎంఆర్‌ కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్‌ హాల్‌లో నృత్య తరంగిణి కళానిలయం ఆధ్వర్యంలో శనివారం భరత కళ వసంతం పేరుతో కూచిపూడి నృత్యంపై వర్క్‌షాప్‌ ప్రారంభమైంది. కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్‌ వసంత్‌ కిరణ్‌ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్ణాటక, కేరళకు చెందిన కూచిపూడి విద్యార్థులకు వర్క్‌షాప్‌ నిర్వహించారు. కళానిలయం నిర్వాహకుడు టి.శ్రవన్‌ కుమార్‌ ముందుగా నటరాజ విగ్రహానికి పూజలు నిర్వహించారు.